బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) కోర్సుల మూడో సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫీజును ఈనెల 6వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఎఫ్ఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ కోర్సుల మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఈ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

నీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, జనవరి 2: సనత్‌నగర్ నియోజకవర్గంలో దశాబ్ద కాలంగా రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేశామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో వేలాది కోట్ల నిధులు వెచ్చించి అన్ని విధాలుగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సనత్‌నగర్ డివిజన్ మార్కెట్ రోడ్డులోని శ్రీనివాస్ భవన్ నుంచి హిందూ పబ్లిక్ స్కూల్ వరకు రూ.65లక్షల వ్యయంతో చేపడుతున్న నీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తలసాని గురువారం శంకుస్థాపన చేశారు. దీర్ఘకాలంగా శిథిలావస్థలో ఉన్న శ్రీనివాస్ భవన్–హిందూ పబ్లిక్ స్కూల్ రోడ్డు నూతన రోడ్డు నిర్మాణ పనులకు అవసరమైన నిధులిచ్చి సహకరించిన ఎమ్మెల్యేకు రాజకీయాలకు అతీతంగా వివిధ పక్షాలకు చెందిన నాయకులు, కాలనీవాసులు శంకుస్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యే తలసానిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గ పరిధిలో డ్రైనేజీ, మంచినీటి, విద్యుత్, రహదారుల వ్యవస్థలను ఆధునీకరించినట్లు వెల్లడించారు. ఇక్కడి నీసీరోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, పనుల్లో నాణ్యతా లోపాలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డితో పాటు జీహెచ్ఎంసీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ వాసుదేవరెడ్డి, ఏఎంవోహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, జల మండలి జీఎం హరిశంకర్, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, దాడి ప్రవీణ్‌రెడ్డి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బీసీల మహాసభను జయప్రదం చేయండి

జంగయ్య

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న బీసీల మహాసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఇందిరాపార్క్ ఎదుట సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. డిక్లరేషన్ అమలు చేయకుంటే కాంగ్రెస్‌పై యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. సభకు రాష్ట్రవ్యాప్తంగా బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలను ప్రకటించి, చేతులెత్తేసి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీసీలను మోసం చేయకుండా ఉండాలంటే అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన అని చెప్పి కేవలం అసెంబ్లీ తీర్మానంతోనే సరిపెట్టారని ఆరోపించారు.

అంబేద్కర్ యువజన సంఘం సంపూర్ణ మద్దతు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ఎదుట శుక్రవారం నిర్వహించనున్న బీసీల మహాసభకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, ఓయూజేఏసీ చైర్మన్ డాక్టర్ బండారు వీరబాబు ప్రకటించారు. 60 శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో అధిక శాతం సీట్లు కేటాయించాలనే డిమాండ్‌ను సమర్థిస్తున్నట్లు చెప్పారు. సభకు ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ముఠా జయసింహ, నాయకులు

ఎమ్మెల్యే పద్మారావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వారాసిగూడ గంగపుత్ర సంఘం నాయకులు

సికింద్రాబాద్, జనవరి 2: కొత్త సంవత్సరం పురస్కరించుకొని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్‌కు పలువురు ప్రముఖులు, నేతలు, అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ సుభాష్‌తో పాటు పలువురు అధికారులు కలిశారు. సికింద్రాబాద్ గంగపుత్ర సంఘం నేతలతో పాటు పలు కుల సంఘాలు, బస్తీ, కాలనీ సంఘాల నేతలు పద్మారావు గౌడ్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బన్సీలాల్‌పేట్: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, లక్ష్మిపతి, బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, నాయకులు వినోద్, గజ్జెల శ్రీను, సురేశ్, మహేందర్‌గౌడ్, దక్షిణమూర్తి, జావెద్ తదితరులు.

మారేడ్‌పల్లి: కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యాక్షుడు, సభ్యులు


బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

బొల్లారం: కంటోన్మెంట్ మైనార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ యాసీన్ కేటీఆర్‌కు శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేశారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి, ఆ పార్టీ నాయకుడు సిరిగిరి శ్యామ్ తదితరులు. – **ముషీరాబాద్, జనవరి 2**

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే తలసానికి కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. మాజీ ఉపాధ్యాక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, నళిని కిరణ్, అనిత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం: మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని గురువారం బోయిన్‌పల్లిలోని ఆయన కార్యాలయంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, లోక్‌నాథ్, నళిని కిరణ్, అనిత ప్రభాకర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బేగంపేట్: వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ హేమలత, జలమండలి జీఎంలు వినోద్‌కుమార్, హరిశంకర్, పార్టీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయ పండితులు ఎమ్మెల్యే తలసానికి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్ సాయిబాబా ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేశారు.

కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యాక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, నళిని, అనిత తదితరులు..

చిక్కడపల్లి: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ గురువారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ గాంధీనగర్, కవాడిగూడ, ముషీరాబాద్ డివిజన్ల అధ్యక్షులు రాకేశ్‌కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, కొండా శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దిన్‌దయాల్ రెడ్డి, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, ఆకుల అరుణ్, శ్రీనివాస్, సాయి చాణిక్యరెడ్డి, భాను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ నల్లవెల్లి అంజిరెడ్డి

ముషీరాబాద్, జనవరి 2: భోలక్‌పూర్ బాకారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం తొలి రోజు ఆలయంలో స్వామి వారికి మేల్కొలు కార్యక్రమం జరిగింది. అంతకుముందు ఆలయంలో పూజలు, అర్చనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్లవెల్లి అంజిరెడ్డి ఊర్మిల, ఒగ్గు కళాకారులతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయం మరింత అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న రెనొవేషన్ కమిటీ చైర్మన్ జానికి సుధాకర్, ఈఓ దేవనాథం

చిక్కడపల్లి, జనవరి 2: చిక్కడపల్లి వివేక్ నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ రెనొవేషన్ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈఓ దేవనాథం తెలిపారు. గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వామివారి ఆలయంలో పలు ఆకారాలు, నగిషీ తొడుగు చేయించాలని, భవాని శంకర స్వామి, భువనేశ్వరి అమ్మవార్ల మందిరాలకు సైతం పనులు ప్రారంభించడానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 4 నుంచి 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు టెండర్ ఫాం ఇవ్వనున్నట్లు తెలిపారు. ముఖ్య అర్చకుడు బుగ్గ లక్ష్మిపతిశర్మ, కమిటీ సభ్యులు పద్మావతి, రామకృష్ణ, శ్యామ్‌ముదిరాజ్, హరీశ్, నీతారాణి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇందునయనకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు

ఇందునయనకు పురస్కారం అందజేస్తున్న వంశీ రామరాజు

ముషీరాబాద్, జనవరి 2: వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో గురువారం సినీ సంగీత విభావరి, వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ విజేత ఇందునయనకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంశీ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ, సుధామయి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీజీ సెట్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభం

టీఎస్ సెట్ సర్టిఫికెట్లు అభ్యర్థులకు అందజేస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: తెలంగాణ స్టేట్–స్టేట్‌లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీ సెట్) సర్టిఫికెట్ల జారీని అధికారులు గురువారం ప్రారంభించారు. గతేడాది మేలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 10 నుంచి మూడు రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించారు. ఫలితాలను నవంబర్ 16న విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తైన అనంతరం సర్టిఫికెట్ల జారీని మొదలుపెట్టారు. ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, సెట్ మెంబర్ సెక్రెటరీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను జారీ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సెట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒరిజినల్ అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌తో వచ్చి తీసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఆ పార్టీ అడిక్‌మెట్ డివిజన్ నాయకుడు రఘు. – **ముషీరాబాద్:**

వ్యాపార సమయాలుపెంచాలి

అబిడ్స్: గోషామహల్‌లో చిరు వ్యాపారాలు చేసుకునే వారికి రాత్రి వేళల్లో మినహాయింపు ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ కోరారు. గురువారం ఆయన ఏసీపీ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారులు పండుగ నిమిత్తం విక్రయాలు జరుపుతారని కోరారు.

చిన్నారులకు స్టడీ టేబుళ్ల అందజేత

చిన్నారులకు స్టడీ టేబుళ్లను అందజేసిన ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్

బన్సీలాల్‌పేట్, జనవరి 2: పద్మారావునగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు స్టడీ టేబుళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ మాట్లాడుతూ సమాజంలో ఒంటరి మహిళలకు కుటుంబ పోషణ ఎంతో కష్టంగా ఉంటుందని, అలాంటి వారి పిల్లల చదువు కోసం ప్రోత్సాహం అందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం రాధే, రాధే గ్రూప్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, బయటి ఆహారాన్ని నివారించి, ఇంట్లోనే అధిక పోషకాహారాన్ని అందించాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్ డాక్టర్ సామల వేణు, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మనోహర్‌రెడ్డి, ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ హ్యాండ్స్ చైర్‌పర్సన్ ఉమాకార్తిక్, కాశెట్టి కుమార్, గీతేశ్ కాటే, డాక్టర్ బాలాజీ, లయన్ వేణు, వేలు కుమార్, సతీస్‌కుమార్, రాంప్రకాస్, జగత్ నారాయణ్, మహేశ్, యాంకర్ శిల్పిక తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన సిద్ధాంతాన్ని కడదాకా ఆచరించిన నేత

హిమాయత్‌నగర్‌లో బర్ధన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

హిమాయత్‌నగర్, జనవరి 2: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన నేత, పార్టీకి, సమాజానికి సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ అందించిన సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా,జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఏబీ.బర్ధన్ వర్ధంతి సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో బర్ధన్ చిత్ర పటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు భావాలను పుణికి పుచ్చుకుని దేశంలో ఎన్నో విప్లవాత్మక ఉద్యమంలో భాగస్వాములయ్యారని,సమకాలీన రాజకీయాల్లో బర్ధన్ ఆదర్శప్రాయుడని కొనియాడారు.ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని ప్రజలకు వారు పిలుపు నిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహా, నేతలు ఆర్.అంజయ్యనాయక్, ఆరుట్ల రాజ్‌కుమార్, ఓరుగంటి యాదయ్య, గోవింద్, శ్రీరాములు, దశరథ్, నరసింహ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 29న హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారిలో గండిగూడ వద్ద నిలబడి ఉన్న టీఎస్ 07జీఎల్ 9819 బోర్‌వెల్ వాహనం చెడిపోవడంతో రోడ్డు పక్కన నిలిపారు. శంషాబాద్ వైపు నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న టీఎస్ 15ఎఫ్‌డీ 3207 నంబర్‌గల బైక్ ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం వారిని ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ డిసెంబర్ 31న నర్సింహ మృతి చెందాడు. గాయపడిన శ్రీనివాస్ నుంచి వివరాలు సేకరించగా నర్సింహ తనకు ఒక్కరోజు ముందు లేబర్ అడ్డాలో పరిచయం అయిన్నట్లు తెలిపారు. ఇద్దరం కలిసి వనపర్తి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిన్నట్లు పోలీసులకు వివరించారు. నర్సింహ బైక్‌ను ఐడీఏ బొల్లారం పీఎస్ పరిధిలో దొంగలించి పారిపోతున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాల కోసం విచారణ చేపడుతున్నామన్నారు. ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్ పోగొట్టుకున్న వ్యక్తి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

షియాలకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ఖైరతాబాద్: రాష్ట్రంలోని షియా ముస్లింలకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని న్యాయవాది వెంకటరఘు కోరారు. లక్డీకాపూల్‌లోని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ స్టడీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షియాలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఫలితంగా చట్టసభల్లోకి వెళ్లలేకపోతున్నారన్నారు. పాలక ప్రభుత్వాలు హామీ ఇస్తున్నాయి తప్ప పట్టించుకోవడం లేదన్నారు. గవర్నర్ కోటాలో ముస్లింలకు ఎమ్మెల్సీ కేటాయించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని పది లక్షల మంది షియా ముస్లింల సంతకాలు సేకరించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జనవరి 2: టీఎస్ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ అంబర్‌పేట, అయ్యప్ప టెంపుల్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శుక్రవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు అంబర్‌పేట్ ఫీడర్ పరిధిలోని ఎంసీహెచ్ కాలనీ, అంబర్‌పేట్, ఆకాశ్‌నగర్, రామకృష్ణనగర్, వినాయక్ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలోని సాయి దత్తాత్రిసింగ్‌హోం, టెలిఫోన్ ఎక్సేంజ్, శివం, మల్లికార్జునగర్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జనవరి 2: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాజు పవార్ (50) పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడు మద్యానికి బానిసై కొద్ది రోజుల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా హైదరాబాద్‌కు చేరుకున్నాడు. అయితే గురువారం ఉదయం మేడ్చల్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నంబర్–3లో అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి జేబులో దొరిగిన ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చూరీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్‌టాప్ మాయం

బంజారాహిల్స్: స్నాక్స్ కొనుకుందామని బైక్ పార్క్ చేసి షాపు లోపలికి వెళ్లి వచ్చేసరికి ల్యాప్‌టాప్ మాయమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీర్‌పేటలో నివాసం ఉంటున్న ప్రతీక్ భార్గవ రాయదుర్గంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి డ్యూటీనుంచి తిరిగి వస్తున్న ప్రతీక్ కృష్ణానగర్ సమీపంలోని ఓ దుకాణంలో స్నాక్స్ తీసుకునేందుకు వెళ్లాడు. 5 నిమిషాల్లో బైక్‌వద్దకు తిరిగి రాగా బైక్ మీద పెట్టిన ల్యాప్‌టాప్ బ్యాగ్ మాయమైంది. ఈ మేరకు బాధితుడు ప్రతీక్ భార్గవ్ గురువారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.